ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విద్యుత్ భారాలపై భగ్గు

సిపిఎం ఆధ్వర్యాన బిల్లుల దహనం

విద్యుత్ భారాలపై సిపిఎం ఆధ్వర్యాన విశాఖ జిల్లాలో సోమవారం నిరసనలు తెలిపారు. కరెంట్ బిల్లులను దహనం చేశారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట ప్రజల నుంచి ప్రభుత్వం డబ్బులు గుంజడం దారుణమని నాయకులు మండిపడ్డారు.

పూర్ణా మార్కెట్ రోడ్డులో నమూనా కరెంట్ బిల్లులతో వినూత్న నిరసన

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డులో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.18 వేల కోట్ల మేర ఆర్థిక భారాలను కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిందని, పెంచిన ఛార్జీలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీకి మేలు కలిగేలా ప్రధాని మోడీ వ్యవహరిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఆ చర్యను వ్యతిరేకించకుండా మద్దతు తెలపడం దుర్మార్గమన్నారు. సౌర విద్యుత్ కుంభకోణంలో గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రూ.1750 కోట్లును అదానీ లంచంగా ఇచ్చారని అమెరికా కోర్టు వెల్లడించినా చర్యలకు కూటమి ప్రభుత్వం సాహసించడం లేదన్నారు. మోడీ దేశాన్ని అమ్మేస్తుంటే రాష్ట్రంలోని కూటమి నాయకులకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, నాయకులు కె.చంద్రశేఖర్, కె.సంతోష్, పైడిరాజు, నరసింగరావు, రమణ పాల్గొన్నారు.

సింహగిరి కాలనీలో కరెంట్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

గాజువాక : పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సింహగిరి కాలనీలో కరెంట్ బిల్లులను దహనం మిగతా 2లో..

విషవాయువు లీకైన ప్రాంతమిదే..

రక్షిత్ ఫార్మాలో విషవాయువు లీక్

- ఇద్దరు కార్మికులకు అస్వస్థత
- ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి : సిఐటియు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రాంకీ ఫార్మా సిటీలో రక్షిత్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ప్రొడక్షన్ బ్లాక్ - 1లో విష వాయువు (హైడ్రోజన్ సల్ఫైడ్) విడుదలవడంతో ఒడిశాకు చెందిన కార్మికులు దేవ్ బాగ్, ఉగ్రేస్ గౌడ్ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారిని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆసుపత్రిలో పరామర్శించారు. సిఎం చంద్రబాబు ఈ ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాద స్థలాన్ని జిల్లా పరిశ్రమల అధికారి నాగ రాజారావు సహా పలువురు అధికారులు, ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వరుస ప్రమాదాలు ప్రభుత్వ, యాజమాన్యాల బాధ్యతారాహిత్యాన్ని వెల్లడిస్తున్నాయని అన్నారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

వార్త 2లో..

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి

వార్త 2లో..

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి : సిపిఎం

వార్త 5లో..

కౌంటర్లలో రోగుల రద్దీ

కెజిహెచ్‌లో సర్వర్ సమస్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో సోమవారం సర్వర్ మొరాయించింది. దీంతో ఓపీలో వందలాది మంది రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఓపీ కౌంటర్ల సంఖ్యను ఇటీవల ఆరుకు పెంచారు. అయినప్పటికీ అవి చాలక రోగులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఓపీ రోగులకు ఇక్కట్లు

ప్రతిరోజూ 1000 నుంచి 1500 మంది వరకు ఇక్కడి ఓపీకి వస్తుంటారు. సోమవారం ఆ సంఖ్య 2 వేల నుంచి 2500 వరకు ఉంటుంది. అయితే ఈ సోమవారం సుమారు 3 వేల మంది వరకు మిగతా 2లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) 2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌కు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జివిఎంసి 2025-26 వార్షిక బడ్జెట్‌పై స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి 2025-26 వార్షిక బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.47644.49 లక్షలు, అన్ని పద్దుల కింద జమలు రూ.423271.00 లక్షలు, ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.470915.49 లక్షలు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.455427.00 లక్షలు, ముగింపు నిల్వ రూ.15488.49 లక్షలు అని తెలిపారు. సభ్యులు బడ్జెట్‌పై చర్చించిన పిదప స్వల్ప మార్పులతో సవరణలపై చర్చించి బడ్జెట్‌ను ఆమోదించినట్టు ఆమె వెల్లడించారు.

హెచ్‌ఎస్‌ఎల్‌కు 3 ప్రతిష్టాత్మక అవార్డులు

అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) మరోసారి సముద్ర పరిశ్రమలో తన ప్రతిభకు చాటుకుంది. ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన 14వ పిఎస్ఇ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో మూడు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకుంది. షిప్ యార్డును ముందుకు నడిపించడంలో ఆదర్శవంతమైన నాయకత్వానికిగానూ హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రిని 'సిఎమ్‌డి ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సత్కరించారు. ఆయన మార్గదర్శకత్వంలో హెచ్‌ఎస్‌ఎల్ నిర్వహణ సామర్థ్యం, సులభతర వాణిజ్యం కోసం పలు సంస్కరణలను అమలు చేసింది, ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఉత్పత్తి విలువ సాధించింది. ఇది 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ. 'సిఎమ్‌డి ఆఫ్ ది ఇయర్' అవార్డుతో పాటు మరో రెండు కేటగిరీల్లోనూ హెచ్‌ఎస్‌ఎల్‌కు అవార్డులు లభించాయి. 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ సస్టెయినబిలిటీ'గా అదనపు జనరల్ మేనేజర్ (సిఎస్ అండ్ సిపి) ఇనైతులా బేగ్ ఈ అవార్డును అందుకున్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ (డిజైన్) ఎం.భానుప్రియ 'పిఎస్‌యులలో మహిళల సహకారం' అవార్డును అందుకున్నారు.

మొదటి పేజీ తరువాయి..

విద్యుత్ భారాలపై భగ్గు

చేశారు. ఈ సందర్భంగా బంగారునాయుడు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు విపరీతంగా పెంచారని విమర్శించారు. కార్యక్రమంలో కామేశ్వరి, స్వర్ణలత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో సర్వర్ సమస్య

ఓపీకి వచ్చారు. అదే సమయంలో సర్వర్ పనిచేయలేదు. దీంతో అన్ని కౌంటర్లలో ఓపీ చీటీలు ఇవ్వటానికి అవరోధం కలిగింది. కిక్కిరిసిన కౌంటర్లలో క్యూలైన్లు ముందుకు సాగలేదు. విషయం తెలియక క్యూ లైన్లలో ఉన్న రోగులు తీవ్రస్థాయిలో అక్కడ సిబ్బందితో గొడవలకు దిగారు. విషయం తెలియడంతో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అక్కడికి చేరుకున్నారు. సర్వర్ పని చేసే వరకూ ఉండకుండా మాన్యువల్ పద్ధతిలో చీటీలు ఇచ్చి పంపే ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియ ప్రారంభించిన కొద్దిసేపటికి సర్వర్ పనిచేయడంతో సమస్య పరిష్కారమైంది.

సినిమా చూస్తున్న చిన్నారులు

పాపా హోమ్ చిన్నారులకు సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతి, జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పాపా హోమ్‌కు సంబంధించిన అనాథ పిల్లలకు ఆక్సిజన్ టవర్‌లోగల మినీ థియేటర్‌లో 35 (చిన్న కథ కాదు) సినిమాను ఆదివారం ప్రదర్శించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన అరుణ్ ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ప్రెసిడెంట్ కెవి.రమణ, మాజీ ప్రెసిడెంట్ ఆర్.రామకృష్ణారావు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, ట్రెజరర్ హుస్సేన్, సభ్యులు ఎస్.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 93 మంది పోలీసులను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో విశాఖ నగర పరిధిలోని కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఎఎస్ఐలను సాధారణ బదిలీలలో భాగంగా తక్షణమే బదిలీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో 15 మంది ఎఎస్ఐలు, 30 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది ఉమెన్ హెడ్ కానిస్టేబుళ్లు, 29 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు ఉమెన్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఎయు వీసీకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.శశిభూషణరావును సోమవారం ఆయన ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మర్యాదపుర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, క్రిస్మస్, నూతన సంవత్సరాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ పేపర్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు విఎస్ జగన్మోహన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్
ఘనంగా సంఘం
విశాఖ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. సంఘం విశాఖ జిల్లా 36వ మహాసభ నగరంలోని ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన చంద్రబాబు, నారా లోకేష్ గెలిచాక ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ ముక్కుపిండి వసూలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జిఒ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలలో పర్మినెంట్ వైస్ చాన్సలర్‌లను నియమించి, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్‌ఛార్జీలను పెంచాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

పలు తీర్మానాలు ఆమోదం

పెందుర్తి, గాజువాకల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చెయ్యాలని, నగరంలో పెరిగిపోతున్న గంజాయి, డ్రగ్స్, మద్యాన్ని నియంత్రించాలని, మహిళలపై అఘాయిత్యాలను, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని ఈ మహాసభలో తీర్మానాలు చేశారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా అజయ్, ఎల్‌జె.నాయుడు

ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ 21 మందితో ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జి.అజయ్, ఎల్‌జె.నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులుగా జి.రాము, జి.పల్లవి, పి.సాయితేజ, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఎం.శశికుమార్, ఎం.కౌశిక్, డి.వెంకటరమణ, ఎం.అజయ్ ఎన్నికయ్యారు.

నాయుడు

అజయ్

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి

నియామక పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిని దేశంలో అగ్ర స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా 14వ రోజ్ గార్ మేళా సోమవారం దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో జరిగింది. ఈ మేళాలో భాగంగా దేశ వ్యాప్తంగా 71 వేల మందికి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలను కేటాయిస్తూ నియామక పత్రాలను అందజేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో పాల్గొనగా విశాఖపట్నంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోజ్ గార్ మేళాకు ముఖ్యఅతిథిగా రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షిస్తూ అందుకు తగ్గ ప్రణాళికలతో ముందుకు వెళ_న్నామన్నారు. మంత్రి లోకేష్ కృషితో విశాఖకు టిసిఎస్, లులు మాల్ రావడంతో యువతకు మరింత ఉపాధి కలుగుతుందని అన్నారు. రోజ్‌గార్ మేళాలో సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్, బ్యాంకింగ్, రైల్వే, పోస్టల్ విభాగాల్లో నియామకాలు పొందిన 667 మందికి తన చేతుల మీదుగా నియామక పత్రాలు ఇవ్వటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. యువతలో నైపుణ్యం పెంచుతూ స్టార్టప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూ రైల్వే జోన్, ఎయిర్‌పోర్టుల విషయమై ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుతో పాటు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఆ అర్జీల పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. వచ్చిన 22 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితరాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్సై డి.వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

పరవాడ : ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయితీలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగంపై సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆంధ్రా మత్స్యకార జేఏసీ జిల్లా అధ్యక్షులు అర్జిల్లి అప్పలరాజు ఫిర్యాదు చేశారు. ముత్యాలం పాలెం పంచాయతీలో సిసి రోడ్ల నిర్మాణం కొరకు ఎన్ఆర్ఇజిఎస్, సిఓఎన్‌వి నిధులు రూ.70.60 లక్షలు మంజూరు కాగా, ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయితీ సర్పంచ్ చింతకాయల సుజాత, ఆమె భర్త చింతకాయల ముత్యాలు తమ సొంత లే అవుట్‌లలో సిసి రోడ్లను నిర్మించుకున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

యలమంచిలి : ఎలమంచిలి మున్సిపాలిటీ ఎర్రవరం రెవెన్యూ, పెద్దపల్లి గ్రామంలో సర్వే నెంబరు 286లో చెరువు భూమిని అతుకుబడి భూమి కింద ప్రభుత్వం ఆరుగురు రెల్లి కులస్తులకు 60 సెంట్లు చొప్పున భూమి ఇచ్చిందని, ఆ భూమి విక్రయం జరిగినా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరేట్‌లో పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఆ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బొద్దపు శ్రీనివాసరావు, పడాల నాగేశ్వరరావు, బొద్దపు గణేష్, నమ్మి రమణ, గొర్ల రామానాయుడు, బొద్దపు అప్పలరాజు, మరిస గణేష్, మచ్చుకర్ల గోవింద, బొద్దపు అశోకు, మరిస నాయుడు, పెద్దపల్లి, మంత్రిపాలెం, గొల్లపాలెం యువకులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE VII SPECIAL MAGISTRATE AT VISAKHAPATNAM
CC. 1975/2023

Between:
M/s. Shriram Transport Finance Co,ltd., ...Complainant
And
PatarlapalliJagannadha Swami ....Accused

NOTICE

PatarlapalliJagannadha Swami, D/NO 3-130/4, OPP A R ENCLAVE, Gallavanipalem, Aganampudi, Near Hunman Temple, Visakhapatnam, 530046.

Please take the Notice that the complainant herein has filed the above Complaint against you seeking Punishment for the offence of Sec 138 and 142 NI Act. You are therefore required to appear in person or through a Advocate/pleader on 07-01-2025 at 10.30 A.M.in the above court to answer all material questions and in case of your failure to do so the case would be proceed against you in your absence in accordance with the procedure as laid down under Law.

T. Ramu
Advocate for complainant
Visakhapatnam, Cell.7396547364

IN THE HON'BLE COURT OF 13TH ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA
AS /2019 IA 656/2019

Between:
Sri. Paturi Bhaskara Rao, Rao,
S/o. Late Elia aged about 52 Years, Employee in Visakhapatnam Steel Plant, Residing at D.No. 31-2-14/49, Flat No. 502. R.K.Towers, Ashok Nagar, Kurmannapalem, Vadalapudi Post, Visakhapatnam-46, Aadhar No. 7613 5405 8915.
...Appellant/1st Dependent
And:
1.Sri. Sabbella Sesha Reddy
S/o. Krishna Reddy, Hindu, aged 30 years, Occupation, Business, resident of Door No. 52-14-34, New Respuvanipalem,Visakhapatnam-13.
...Respondent/Plaintiff
2. Sri LIC Housing Finance Limited. represented by its Branch Manager, 3rd Lane, Dwarakanagar, Visakhapatnam-16.
...Respondent/2nd Defendant

పై నెంబరు వాజ్యంలో రెస్పాండెంట్ 1 ఐన (Sri Sabbela Sesha Reddy S/o Krishna Reddy) ఐ ఉన్న మీకు పిటీషనర్/అపీలేంట్ గారు కోర్టు ద్వారా ఎన్ని నోటీసులు పంపిననూ మీ నుండీ ఎటువంటి స్పందన లేదు. మీరు ఉద్దేశపూర్వకంగా నోటీసును నిరాకరించినారనీ తెలిసి పిటీషనరు పై కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన వేయించి యున్నారు. కావు ఆ మీరు **తేదీ. 09-01-2025 న ఉదయం 10:30 ని॥** స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై నెంబరు పిటీషన్‌లో మీ యొక్క హాజరు అవసరమై యున్నది లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షంగా పై నెంబరు పిటీషను విచారించెదరు.

పిటీషనరు తరపు న్యాయవాది
Sri Krishnam Raju, 9848014809
Sri B.V.M.Krishna, 9866278920
Smt.Anuradha Patnaik, 9704976321
Advocats.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

ఆరిలోవ తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రంగులు వెలిసిపోయిన స్పీడ్ బ్రేకర్లు

ఇష్టానుసారంగా ఎత్తుతో నిర్మాణాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వాహనాలను నియంత్రించి, రోడ్డు ప్రమాదాల నివారణకు వేసిన స్పీడ్ బ్రేకర్లే ఒక్కో చోట ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇవి సరిగ్గా లేకపోవడంతో చాలా మంది గాయాలు పాలవ్వగా, కొంత మంది మృత్యువాత పడుతున్నారు. ఆరిలోవ ప్రధాన రహదారులు, వీధి రోడ్లపై వేసిన స్పీడ్ బ్రేకర్లు చాలా వరకు ఇబ్బందికరంగా మారాయి. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సూర్యతేజనగర్, ఆదర్శనగర్, మరికొన్ని వీధి రహదార్ల వేసిన స్పీడ్ బ్రేకర్లలో కొన్ని ఎత్తుగాను, మరికొన్నింటికి అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్నట్టుగా గుర్తించే రంగులు వేయకపోవడం, వేసినా అవి వెలిసిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఎత్తుగా ఉండడంతో వాహనాల కింది బాగం తగిలి మరమ్మత్తులకు గురవుతున్నాయి. మరికొన్నింటికి రంగులు వెలిసి పోవడంతో స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేసిన స్పీడ్ బ్రేకర్లను పరిశీలించి, వాటిని వాహనదారులకు సౌలభ్యంగా ఉండేలా మార్పులు చేయాలని, స్పీడ్ బ్రేకర్లను గుర్తు పట్టే విధంగా వాటికి రేడియం రంగులు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

అద్దె బస్సు అపహరణ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక ఆర్టీసి డిపోకు చెందిన అద్దె బస్సు సోమవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. స్థానిక టౌన్ సిఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం ఆర్టీసి డిపో నుంచి తుని వెళ్లాల్సిన ఆర్టీసి అద్దె బస్సు ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఈ బస్సు ఉదయం 4.30 గంటల సమయంలో నర్సీపట్నం నుంచి తుని వెళ్లాల్సి ఉందని ఆర్టీసి డిపో ఆవరణలో ఉదయం ఈ అద్దె బస్సును తీసుకొని తుని వెళ్లాల్సిన డ్రైవర్ డ్యూటీ సమయానికి డిపో వద్దకు వచ్చి చూడగా బస్సు కనిపించలేదు. దీంతో బస్సు యజమాని గీతంరాజకు తెలియజేశారు. నర్సీపట్నం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన టౌన్ సిఐ గోవిందరావు రెండు టీంలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చింతపల్లి సమీపంలోని చింతలూరు వద్ద చోరీకి గురైన బస్సు పట్టుబడిందని సిఐ తెలియజేశారు. నిందితుడిని తమ అదుపులో ఉన్నాడని, వెల్లడించారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని చెప్పారు.

పిజిఆర్ఎస్‌కు అర్జీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో అధికారులకు రెండు అర్జీలు అందాయి. రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి చెరొక అర్జీ అందినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి జోన్-3 కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 10 అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాదరావు తెలిపారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్య, ప్రేమలత, డిప్యూటీ తహశీల్దార్ త్రినాధరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్‌చేశారు. ఈ మేరకు ద్వారకానగర్ బుద్దిన పార్క్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే డ్రైవర్లకు రూ.15 వేలు వాహనమిత్ర ఇస్తామని, జీవో 21, 31లను రద్దుచేస్తామని, డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, డ్రైవర్లు అందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తామని, వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు రావికృష్ణ, యు.శివాజీ, భాస్కర్, శ్రీను, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ ప్రారంభించిన ప్రజా దర్బార్‌కు సోమవారం ఆదరణ లభించింది. భాదితులు విఎంఆర్‌డిఎ కార్యాలయానికి వచ్చి వినతులు అందజేశారు. ఇంజినీరింగ్ -1, ప్లానింగ్ - 7, ఎస్టేట్ - 2 , రెవెన్యూ -2, ఇతర విభాగాలకు సంబంధించి మరికొన్ని వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, శిల్ప, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రుషికొండ బీచ్ సౌత్ రోడ్డు ప్రారంభం

రుషికొండ బీచ్ సౌత్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : వైసిపి హయాంలో ఐదేళ్లు మూసివేతకు గురైన రుషికొండ బీచ్‌కు వెళ్లే సౌత్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బీచ్ అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల ప్రయోజనార్థం కూటమి నాయకులు రోడ్డు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు ఆ రోడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు రోడ్డులో నడుచుకుంటూ వెళ్లి తీరం అందాలను వీక్షించారు. పర్యాటకుల సౌకర్యార్థం రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచి సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత మార్గాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. రుషికొండ బీచ్‌కు వెళ్లేందుకు ఒకే మార్గం ఉండటం చేత వారాంతపు రోజుల్లో సందర్శకులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం ఈ మార్గం అందుబాటులోకి రావడంతో సందర్శకులకు సౌలభ్యం కలుగుతుందన్నారు. రుషికొండ ప్యాలెస్ కోసం వైసిపి నాయకులు ఐదేళ్లపాటు ఈ మార్గాన్ని మూసివేసారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, టిడిపి నగర అధ్యక్షులు గండి బాబ్జి, జనసేన భీమిలి నియోజవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, జోన్ -2 కమిషనర్ ఎంబిడి ఫణిరామ్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిట్టిపిల్లి గోపి, శాఖరి శ్రీనివాస్, అక్కరబోయిన రాంబాబు, సారిపిల్లి శ్రీనివాస్, ఉప్పులూరి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అపర్ణకు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నం కూచిపూడి కళాకారిణి అపర్ణకు బెంగళూరు కూచిపూడి మరకతమని సౌత్ ఇండియా ఉమెన్ అచివర్ అవార్డు 2024ను ప్రదానం చేసింది. మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన ఎస్ఎస్‌బి అపర్ణ నృత్య కౌశలం వేనోళ్ళ ప్రశంసలు పొందుతోంది. ఇప్పటికే జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో అపర్ణ పలు బహుమతులు అందుకున్నారు. సుమారు 500 ప్రతిష్టాత్మక వేదికలలో ప్రదర్శన ఇచ్చి అవార్డులు గెలుచుకుని రికార్డులను నెలకొల్పారు.

2008 ఆగస్టులో శ్రీదేవి - జనార్ధనరావు దంపతులకు జన్మించిన ఆమె తొమ్మిదేళ్ల వయసులోనే కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభించారు. గత 7 సంవత్సరాలుగా కూచిపూడి నృత్య కళను తన ప్రదర్శనలతో చాటుతూ ఆహూతులను ముగ్ధులను చేస్తూ కూచిపూడి గొప్పతనాన్ని చాటుతున్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఎక్సలెన్సీ బుక్ ఆఫ్ రికార్డ్, సౌత్ ఇండియా ఆర్ట్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డ్ లలో సైతం పేరు నమోదు చేసుకున్న ఎస్ఎస్‌వి అపర్ణ పలు పురస్కారాలు, అవార్డులు పొందారు. నాట్య బాల పురస్కారం, నాట్య కుసుమల ప్రతిభా పురస్కారం, స్వామి వివేకానంద కళా పురస్కారం, గరుడ కీర్తి పురస్కారం, నృత్య ప్రతిభా పురస్కారం, ఉగాది నృత్య ప్రతిభా పురస్కారం వంటివి అపర్ణ పొందారు. బెంగళూరు కూచిపూడి తరంగం మరకతమని ప్రదానం చేసిన సౌత్ ఇండియా ఉమెన్ ఆచీవర్ అవార్డు 2024 పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. రామ్ చరణ్ ట్రోఫీలో ప్రత్యేక జ్యూరీ అవార్డు, మిలాన్-2023, 2024లో తన ప్రతిభతో అపర్ణ ఆకట్టుకుంది ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలలో పద్మశ్రీ చిరంజీవి చేతులమీదుగా ప్రత్యేక సన్మానం కూడా పొందారు.

మధురవాడలో పశువుల ఆసుపత్రి నిర్మించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 5వ వార్డు పరిధి మధురవాడలో పశువుల ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రం, శ్మశాన వాటికకు స్థలాలు కేటాయించి, పక్కా నిర్మాణాలు చేపట్టాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, మధురవాడ ప్రాంతం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పశువుల ఆసుపత్రికి ప్రభుత్వ స్థలం కేటాయించి నిర్మాణం చేయాలని, రాజీవ్ గృహకల్ప, వైఎస్ఆర్.కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలలో అంగన్‌వాడీ కేంద్రం లేక గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సుమారు 4 కిలోమీటర్లు నడిచి జాతీయ రహదారిని దాటుకుంటూ అక్కడ ఉన్న కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఆయా కాలనీలలో త్వరితగతిన అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. వైఎస్ఆర్ కాలనీ, శివశక్తినగర్ కాలనీలకు శ్మశాన వాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తొందర్లోనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఆమె చెప్పారు.

గీతం పాలక మండలి సభ్యులుగా జస్టిస్ విజయలక్ష్మి, సిహెచ్.పద్మజ

ప్రజాశక్తి - మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయ లక్ష్మి, అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగ నిపుణురాలు పద్మజా చుండూరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిలో జస్టిస్ కె.విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులో జడ్జిగా సేవలందించారు. అమె ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి బిఎల్.డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎల్.డిగ్రీ పొందారు. ఆమె రెండు తెలుగు రాష్ట్రాలలలో ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా పనిచేశారు.

పద్మజ చుండూరి భారతదేశంలో, అమెరికాలో 37 సంవత్సరాల బ్యాంకింగ్, క్యాపిటల్ మార్కెట్స్ అనుభవం కలిగిన ప్రముఖ ఆర్థిక సేవలు నిర్వాహకురాలుగా పనిచేశారు. అమె ఎన్ఎస్‌డిఎల్ (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్), ఇండియన్ బ్యాంక్‌కు ఎమ్‌డి అండ్ సిఇఒగా పనిచేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్‌గా డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు నేతృత్వం వహించారు. అమెరికాలో బ్యాంక్ కార్యకలాపాల చీఫ్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. భారత దేశంలో తొలి డిఎల్‌టి బ్లాక్‌చైన్ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసి కార్పొరేట్ డెబ్ట్ సెక్యూరిటీ, మానిటరింగ్‌ను నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎల్ఐసి, ఎన్‌పిసిఎల్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) బోర్డుల సభ్యురాలిగా ఉన్నారు. ఇద్దరు శక్తివంతమైన మహిళల నాయకత్వం, మార్గదర్శకత్వం గీతం విశ్వవిద్యాలయం ప్రగతికి, మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగపడగలదన్న ఆశాభావాన్ని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ వ్యక్తం చేశారు.

అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలకు గీతం జట్టు

ప్రజాశక్తి -మధురవాడ : భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో ఎఐయు ఆధ్వర్యాన ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పురుషుల పోటీలలో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం జట్టులో గ్లిన్ ఒపియో, ఎల్.బానుతేజ, కె.హరీష్, డి.ధనిక్‌బాబా, ఎమ్.మురారి, మసాంగో మార్టిన్, డి.రాజు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. గీతం జట్టు మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా ఎ.మురగన్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన గీతం జట్టు

ప్రదర్శనలను తిలకిస్తున్న పద్మనాభం ఎంఇఒ రమణ

పలు చోట్ల గణిత దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం: పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్లో సోమవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు 100 ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను పద్మనాభం ఎంఇఒ పి.రమణ పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవంలో భాగంగా జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. రామానుజన్ చిత్ర పటానికి స్కూల్ డైరెక్టర్ పాలవలస భాస్కరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ సాధించిన విప్లవాత్మక మార్పులను విద్యార్థులకు వివరించారు. సంఖ్యా సిద్ధాంతం, ప్రధాన సంఖ్యలు, అనంత శ్రేణి, భిన్నాలు తదితరాలపై విద్యార్థులు ప్రాజెక్టులు తయారుచేసి మిగిలిన విద్యార్థులకు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను స్కూల్ ప్రిన్సిపల్ అందించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శ్వేత, గౌరీ, ప్రణీత, శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో విజయమోహన్, పల్లవి

ఇంటర్ యూనివర్శిటీ మహిళల హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రాయూనివర్శిటీ ఇంటర్ యూనివర్శిటీ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు ఏయూ హాకీ మహిళల జట్టును ఎంపిక చేశారు. ఎయు జిమ్నాజియంలో క్రీడాకారులను డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య విజయమోహన్ మాట్లాడుతూ, తిరుచునాపల్లి భారతీయ దాసన్ యూనివర్శిటీలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ, హాకీ పోటీల్లో ప్రతిభ సాధించి యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం పంచాయతీ పరిధిలో సోమవారం రూ.2,80,000 మండల పరిషత్ నిధులతో ఏర్పాటుచేసిన కుళాయిలను ఎంపిపి రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు లక్ష్మీనాయుడు, సర్పంచ్ పాప, టి.పద్మనాభం, సుమంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

25న వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 23వ వార్షికోత్సవం ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు డాక్టర్ పింగళి అనందకుమార్, డివి నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి జగన్ తదితరులు

పలుచోట్ల పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి సుజాతనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సిపిఎం విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పలుచోట్ల పోస్టర్లను ఆవిష్కరించారు.

పెందుర్తి : స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీన పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ వరకు మహా ప్రదర్శన, అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విశాఖపట్నం అభివృద్ధి, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ రక్షణ కోసం సిపిఎం అనేక ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ముడసర్లోవ పార్కు, పూర్ణామార్కెట్, ఎంవిపిలో రూ.25కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరినా ప్రైవేటీకరణ, జివిఎంసి అక్రమాలు, అవినీతి చర్యలపై పోరాడుతోందన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా చెత్త పన్నును రద్దుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. విలువ ఆధారిత ఆస్తిపన్ను రద్దు కోరుతూ పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ధరలపై ఆందోళనలు చేస్తోందని చెప్పారు. ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు, స్కీమ్ ఇళ్లు, కొండవాలు ప్రాంతాలు, స్లమ్స్, మధ్యతరగతి కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తోందన్నారు. రాబోవు కాలంలో ప్రజాసమస్యల పరిష్కారానికై జరిగే పోరాటాలు, మహాసభలు విజయవంతానికి ప్రజలంతా సహకారం అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు జక్కన సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మహాసభను జయప్రదం చేయాలని పద్మనాభం సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం భీమిలి జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ, పెందుర్తిలో జరిగే బహిరంగ సభకు కార్మికులు, రైతులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిడి రాము, ఎస్.పద్మనాభం, ఎస్.కృష్ణ, ఎం.అప్పారావు, పి.రమణ, పల్లా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెం జోన్ పరిధి ఎఎస్ఆర్‌నగర్‌లో సిపిఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బహిరంగసభను జయప్రదంచేయాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యపాలెం ఏరియా నాయకులు యుఎస్ఎన్.రాజు, అప్పలరాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్ఆర్.నగర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

జోనల్ కార్యాలయానికి రికార్డు స్థాయి ఆదాయం

జోనల్ కమిషనర్ శేషాద్రికి చెక్కు అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలో ఒక్క రోజులో రికార్డుస్థాయి ఆదాయం వచ్చింది. గాజువాక జోన్ -6 రెవెన్యూ విభాగం (ట్యాక్స్) సోమవారం రూ.1.09 కోట్లు రాబట్టింది. బిహెచ్‌పివి, బెహరా ఇంజినీరింగ్ కాలేజీ నుంచి అర్థ త్రైమాసిక పన్ను మార్చి- 2025 వరకు జివిఎంసి పన్ను వసూలు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జోనల్ కమిషనర్ శేషాద్రికి ఆర్ఒ రామ్‌నారాయణ్, శ్రీకాంత్, ఆర్ఐ సుభాన్, బిల్లు కలెక్టర్ మధు అందజేశారు.

అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్, కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యాన స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బిజెపిలో ఉన్న దళిత నాయకులు తక్షణమే కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు ఎగరవేయాలని పిలుపునిచ్చారు. జాతిని అవమానించినప్పుడు ఆ పదవులకు తక్షణమే రాజీనామా చేసి జాతి రక్షణ కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో భయ్యా మల్లయ్య, సత్యనారాయణ, వైటి.దాస్, చిరంజీవి, వి.ప్రకాష్, రామస్వామి, పుల్లారావు, కె.పరంధామయ్య, రమణ, రవికాంతారావు, నూకరాజు, జాని తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సోమవారం "బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్" కార్యక్రమం అనకాపల్లిలో చేపట్టింది. గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న పూలమాల వేసి సమ్మాన్ మార్చ్ ప్రారంభించారు. అక్కడ నుండి సుమారు రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి నెహ్రూచౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అక్కడ నిరసన చేపట్టారు. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి తెలియజేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు సుబ్బన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.కోటేశ్వరరావు, ఎం.చక్రవర్తి, టి.అనంతరావు, కె. చినబాబు, పి.కొండలరావు, పి. దత్తు, కె.సత్యనారాయణ, బి.భానుమూర్తి యాదవ్, ఎం.రాహుల్, ఎం. సింహాచలం, కె. నూక అప్పారావు, బి.రాజు, పి.ఆదిమూర్తి, చిట్ల చలపతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మాన్ మార్చ్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి గణేష్‌నగర్ కాలనీలో రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, గణేష్ నగర్ కాలనీలో పూర్తిగా పాడైపోయిన రోడ్లు, కాలువలను పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. కాలనీలో ప్రధాన కాలువ నిర్మాణం కూడా తొందర్లోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వాంద్రాసి అప్పలరాజు, నాగోతి వెంకట సత్యనారాయణ, నమ్మి శ్రీను, చలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సాయి రిత్విక్ ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ వింగ్స్ షాటో కాన్ ఆధ్వర్యాన ప్రధాన శిక్షకుడు సాయికుమార్ వద్ద శిక్షణ పొందిన దాసరి ఈశ్వరసాయి రిత్విక్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించాడు. జివిఎంసి 6వ వార్డు పరిధి అర్‌హెచ్ కాలనీలో నివాసముంటున్న సూరిబాబు, గౌరి దంపతుల కుమారుడు ఈశ్వరసాయి రిత్విక్ వివిధ విభాగాల్లో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నాడు. ఆదివారం విక్టరీ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన కాకినాడలో జరిగిన 3వ జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. గత నెల 19 నుంచి 24వ తేదీ వరకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఢిల్లీలో జరిగిన పోటీలలో ఏడేళ్ల కేటగిరీ కత విభాగంలో కాంస్య పతాకం, కుమితి విభాగంలో వెండి పతాకం సాధించాడు. వీటిని పురస్కరించుకొని వింగ్స్ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈశ్వర్ సాయి రిత్విక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మల్లికార్జునగౌడ్, సాయికుమార్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్

అనకాపల్లి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి నిధులు కేటాయించాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలన్నారు. గ్రామీణ వ్యవసాయ రంగం కరువు కాటకాల నుంచి బయటపడాలంటే సాగునీటి వనరులను పెంపొందించడమే పరిష్కారమని సూచించారు. శని, ఆదివారాల్లో నర్సీపట్నంలో జరిగిన సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ అనేక అంశాలపై సమగ్రంగా చర్చించి 22 తీర్మానాలు చేసిందని తెలిపారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనుల వ్యవసాయోత్పత్తులను జిసిసి కొనుగోలు చేయాలని కోరారు. తీర ప్రాంతంలో కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటును నియంత్రించాలని, పర్యావరణ ప్రమాణాలు, కార్మికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పరిశ్రమల్లో ఉత్పత్తిని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ ఆడిట్‌ను పరిశ్రమలన్నింటిలోనూ నిర్వహించి లోపాలను సరిదిద్దాలన్నారు. పరిశ్రమలలో ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లింపును తప్పనిసరి చేయాలన్నారు. వ్యవసాయాధారిత ఉత్పతుల పరిశ్రమలను ప్రోత్సహించి కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటును నిలిపివేయాలని కోరారు. క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి పునరుద్ధరించాలని, విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణ ధరను ఇటీవల రూ.3 తగ్గించారని, దాన్ని పునరుద్ధరించి చెల్లించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వలస కార్మిక చట్టం - 1979 ప్రకారం వలస కార్మికులకు ప్రయోజనాలు, సదుపాయాలు వర్తించేలా ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షించాలన్నారు. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఆ దిశగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి నిధులు రాబట్టాలన్నారు. జిల్లాలోని ప్రజల సమస్యలపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మహాసభలో 21 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైందని పేర్కొంటూ ఆ వివరాలను వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రుత్తల శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఇ.చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

సాంకేతిక సహాయంతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సాంకేతికత సహాయంతో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్‌ఓ) కనకమేడల వివిఎల్.నరసింహమూర్తి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, అనకాపల్లి మండల కన్జ్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీగౌరీ గ్రంథాలయంలో 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అంశంపై జరిగిన సదస్సు జరిగింది. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని స్పష్టం చేశారు.కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ 'బిఐఎస్ కేర్' యాప్ ద్వారా బంగారు ఆభరణాల స్వచ్ఛతను తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారులు కె.కృష్ణారావు, ఎం.నరసింహులు, హాస్టల్ వార్డెన్ అధికారి ఎస్.సత్యనారాయణ, గౌరీ గ్రంథాలయ ప్రతినిధులు దొడ్డి నూకఅప్పారావు, కాండ్రేగుల జగ్గారావు, జగన్నాథ స్వామి ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ దాడి ఈశ్వరరావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బుద్ద ప్రవీణ్‌కుమార్, బొడ్డేడ జగ్గఅప్పారావు, బి.మౌనిక, అప్పారావు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ ఫెయిర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న పాయకరావుపేట నియోజకవర్గంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మెగా జాబ్ ఫెయిర్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మెగా జాబ్ ఫెయిర్‌కు సుమారుగా 50 జాతీయ, బహుళ జాతీయ కంపెనీలు హాజరై సుమారు రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు జాబ్ ఫెయిర్ వివరాలు తెలియజేస్తూ ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బి.టెక్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐ.టి.ఐ కోర్సులలో ఉత్తీర్ణత సాధించి 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు పాయకరావుపేట, శ్రీప్రకాష్ డిగ్రీ కాలేజీలో జరుగు మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవాలని, అడ్మిట్ కార్డ్‌తో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్‌లతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893799420, 9492429425, 9010793492 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్‌ఓ వై.సత్యనారాయణరావు, డిఆర్‌డిఎ పీడీ సచీదేవి పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు చినగొల్లలపాలెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఆరో వార్డ్ మెంబర్ పల్లా తాతరావు, గ్రామ పెద్దలు శంకుస్థాపన చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నిధుల నుండి రూ.10 లక్షలు, సబ్బవరం పంచాయతీ నిధుల నుండి రూ.4 లక్షలు వెరసి రూ.14 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొర్లి కృష్ణ చైతన్య, మాజీ ఎంపీటీసీలు పల్లా సన్యాసిరావు, కోరాడ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు పోతల కనకరాజు, గొర్లి కనకం, టి.శేఖర్, ఎం.అక్కుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారు. విజయవాడలో కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 22, 23 తేదీలలో అండర్ 17 అంతర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా తరుపున వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వి.ధనరాజ్, సిహెచ్ కుమారస్వామి వివిధ విభాగాల్లో గోల్డ్ మెడల్స్, పెద్దాడ సూర్య సాకేత్ సిల్వర్ మెడల్, ఎం. నాగరాజు బ్రాంజ్ మెడల్ సాధించారు. బాలికల్లో ఏ. పూర్వజ గోల్డ్ మెడల్, ఎం. లక్ష్మీదేవి సిల్వర్ మెడల్ పి.సాయి సంజనశ్రీ, ఎం.అమృతవల్లి సిల్వర్ మెడల్స్ సాధించారు. విజేతలను ఉమ్మడి విశాఖ జిల్లా టీం కోచ్ వి.కొండబాబుని ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రెటరీ వి.దేముడు, అనకాపల్లి ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎంవి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల తనిఖీకి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి మండల స్థాయిలో శిశు సంక్షేమ శాఖ, తహసీల్దారు, పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000 మంది బాలురు, 981 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఎం ఎస్ వి కె బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ జ్యోతి, గైనకాలజిస్ట్ శోభా దేవి ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి-కశింకోట : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని అనకాపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో కిశోర్ వికాశంపై శిక్షణ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుండి 18 సవత్సరాలలోపు బాలికల రక్షణ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ శిక్షణలో డాక్టర్ తిరుపతిరావు, న్యాయవాది కుసుమ, కేఎల్.మోనోహర్, పంచాయతీ విస్తరణ అధికారి వెంకటలక్ష్మి సూపర్ వైజర్లు సుచరిత, ఆదిలక్ష్మి, వంశీప్రియా, అంగన్వాడీ, సచివాలయం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చి'వరి' రక్షణకు రైతుల పాట్లు

పొలంలో ఉన్న వరి పనలను ఒడ్డుకు తెచ్చిన దృశ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది

అకాల వర్షాలకు అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వరుస తుపానులతో రైతులు అతలాకుతలమయ్యారు. మిగిలిన వరి పంటను రక్షించుకునేందుకు రైతులు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. బుచ్చయ్యపేట మండలంలో పండిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో వరి పనలు మోపులు కట్టి నీటిలోంచి బయటకు మోస్తున్నారు. గట్లు పైన ఆరబెడుతున్నారు. పనలు ఆరకపోయినా చిన్న చిన్న కుప్పలు పెడుతున్నారు. గింజలు మొలకలు రాకుండా ఉప్పు ద్రావకం స్ప్రే చేస్తున్నారు. సోమవారం ఉదయం మళ్లీ ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉరుకులు, పరుగులతో పొలాలకు పరుగులు తీశారు. కొంత మంది వరి పనలను కుప్పలుగా పెట్టగా మరి కొంతమంది రైతులు తడిచిన వరి పనలను యంత్రాలతో నూర్పిడి చేశారు. అయితే ఇప్పటికే తడిసిన వరి పనలు కొన్ని ప్రాంతాల్లో మొలకలు వచ్చాయి. డిసెంబర్ నెలలో ఇప్పటికే మూడు తుఫానులు ఏర్పడ్డాయి. పండిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని వడ్డాది, కస్పా, చిన్నప్పన్నపాలెం, కేపి అగ్రహారం గ్రామాలలో వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని, పంటల బీమా వర్తింపచేయాలని రైతులు వేడుకుంటున్నారు.

మొలకెత్తిన వరి ధాన్యం

ఎమ్మెల్సీ కల్యాణిని కలిసిన రవికుమార్

ప్రజాశక్తి-సబ్బవరం : ఎమ్మెల్సీ వరదు కళ్యాణిను వైసిపి పెందుర్తి నియోజకవర్గ నాయకులు గండి రవికుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కార్యక్రమాలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఐడి బాబు, నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు పి.శేఖర్, నాయకులు యడ్ల నాయుడు, బత్తిన వెంకటరమణ, గోటిరెడ్డి వంశీ తదితరులు పాల్గొన్నారు.

వాహన ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పాడేరు: : హిట్ అండ్ రన్ కేసులలో ఆచూకీ లేని వాహన ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి హైబ్రిడ్ విధానంలో మొదటిసారిగా జరిగిన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన సందర్భంలో వాహనాన్ని గుర్తించలేనప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అంశానికి సంబంధించి ప్రజలలో అవగాహన లేనందున సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గుర్తు తెలియని వాహనాలు ఢీకొడితే ఎవరైనా పరిహారం కోసం సంబంధిత సబ్ కలెక్టర్ వారికి ఫారం -1 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సుప్రీమ్ కోర్ట్ ఆదేశాల మేరకు జిల్లా పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసామని తెలిపారు. క్లెయిమ్ దరఖాస్తు చేసిన నెల రోజులు లోపు క్లెయిమ్స్ విచారణ ఆఫీసర్ నివేదిక క్లెయిమ్ సెటిల్మెంట్ కమీషనర్‌కు ఇవ్వాలని సూచించారు. క్లెయిమ్ సెటిల్మెంట్ కమిషనర్‌కు నివేదిక వచ్చిన 15 రోజులలో బీమా మొత్తం మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి నెల ఆఖరి మంగళవారం రివ్యూ మీటింగ్ లో నెలవారీ పీరియాడికల్ నివేదిక కమిటీకి ఇవ్వాలని పేర్కొన్నారు.

రైతు వ్యతిరేక మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతాంగ వ్యతిరేక మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని రైతు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నిరసన దీక్షకు మద్దతుగా, మార్కెట్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. మార్కెట్ చట్టం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయనబాబు, ఏఐటియుసి నాయకులు దొరబాబు, సన్యాసిరావు, సిపిఎం నాయకులు ఉమామహేశ్వరరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు మోహన్‌రావు మాట్లాడారు. ఢిల్లీలో 13 నెలల కాలం రైతాంగం చేసిన పోరాట ఫలితంగా ప్రధాని మోడీ రైతులకు క్షమాపణలు చెప్పి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, 2020 విద్యుత్ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు నాడు ప్రకటించారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని తెస్తామని, ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని, వ్యవసాయం లాభసాటిగా మారుస్తానని నాడు ప్రధాని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఏ చట్టాలు అయితే రద్దు చేశారో వాటిల్లో ఉన్న అంశాలను నేడు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయించడానికి పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేట్లకు లొంగిపోయి మార్కెట్ యార్డులను ప్రైవేటు వాళ్లకి అప్పగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని, ఇచ్చిన హామీలు అమలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక నేతలు

గురుకుల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్ సోమవారం సందర్శించి పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతి గృహంలో జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శాఖ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి, ప్రిన్సిపాల్ జి.గ్రేస్, పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చియ్యపేట : ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఎంపీడీఓ వి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బుచ్చియ్యపేట, దిబ్బిడి, లోపూడి, పొట్టిదొరపాలెం, కెపి. అగ్రహారం గ్రామ సచివాలయాల్లో సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు.

కాలు, చెయ్యి విరిగితే ఉచితంగా కట్లు

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రమాదవశాత్తు కాలు విరిగినా, చెయ్యిలు విరిగినా, శరీరంపై దెబ్బలు తగిలినా, నరాలు బెనికినా ఆయుర్వేద వైద్య విధానంలో ఉచితంగా కట్టులు కట్టి నయం చేయడం జరుగుతుందని ప్రముఖ ఆయుర్వేద మూలిక వైద్య నిపుణులు, హిందీ మాస్టారు రెడ్డి కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తాను వంశపారపర్యంగా ఆయుర్వేద వైద్యాన్ని తన తాత పరమేశ్వరరావు దగ్గర నేర్చుకుని ఆయుర్వేద వైద్యం పేదలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. దేవరాపల్లి డాక్టర్ అంబేద్కర్ గురుకులంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పేదలకు ఉచిత ఆయుర్వేద మూలికా వైద్య విధానంలో కాలు, చేయి విరిగినా, శరీరంపై దెబ్బలు తగిలినా, బెనికినా, కీళ్ళ నొప్పులకు, మోకాళ్ళ నొప్పులకు ఉచితంగా కట్లు కట్టి నయం చేస్తున్నట్లు తెలిపారు. సబ్బవరం పంచాయతీ శివారు పెదనాయుడుపాలెంలో నివాసం ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఉచితంగా కట్లు కట్టి బాగు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9440046367 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని అప్పారాయుడుపాలెం పంచాయతీ దార భోగాపురం గ్రామం అంగన్వాడి సెంటర్లో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో పోషకాహారంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆర్డినేషన్ సౌజన్య, మాజీ సర్పంచ్ సరస్వతి, జనసేన నాయకులు ఉరిటి నానాజీ, హెల్త్ టైం పోషణ సఖి శ్రీలక్ష్మి, పద్మ, అంగన్వాడి టీచర్, న్యూట్రిషన్, వాలంటీర్ దేవి, గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'హై టీ హెూలీ క్రిస్టమస్ - 2024' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యానారాయణ మూర్తి పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్ పాల్, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనారిటీ సంక్షేమ శాఖ (ఇంచార్జి) ఎమ్.సత్య పద్మ, జిల్లా పంచాయితీ అధికారి ఆర్ శిరీష రాణి, జిల్లా విద్యా శాఖ అధికారి అప్పారావు నాయుడు, జిల్లా ఖజానా శాఖ అధికారి వివిఎల్ సుభాషిణి, ఎపిఈపిడిసిఎల్ ఎస్‌ఈ ప్రసాద్, జిల్లా అధికారులు, పాస్టర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యన్న స్కూల్ డైరెక్టర్ నూర్జహాన్ క్రిస్మస్ కేక్ కట్ చేయగా క్రిస్మస్ తాతల వేషధారణలో పలువురు చిన్నారులు కేక్‌ను తోటి చిన్నారులకు పంచారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుమతి, పద్మిని, శ్రావణి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఫాదర్ సైమన్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ లోచల సుజాత హాజరై మాట్లాడారు. యేసుక్రీస్తు నామమున ప్రజలందరికీ శాంతి, సమాధానం కలగాలని కోరుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జైశీలం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో పంచాయతీలు నిర్వీర్యం

ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-కశింకోట

గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని పంచాయతీలను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆరోపించారు. కశింకోటలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపం వద్ద సోమవారం వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.10 కోట్లతో కశింకోట పరమటమతల్లి గుడి రోడ్డు, రూ.1.47 కోట్లతో గోపాలపురం చిన్న ముసలివాడ రోడ్డు, రూ.1.96 కోట్లతో సంపతిపురం- కసింకోట రోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ కొత్తగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. పార్లమెంట్ సభ్యులు సిఎం.రమేష్ మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి శాసన సభ్యులు కొణతాలరామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు డి. పరమేశ్వరరావు, గొంతిని శ్రీనువాసరావు, ఉగ్గిని రమణమూర్తి, కాయలు మురళీ, వేగి గోపికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై హామీని అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన హామీని అమలు చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు డిమాండ్ చేశారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి, వైఎస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కరెంటు చార్జీల బాదుడుపై వైసిపి పోరుబాటు పోస్టర్‌ను సోమవారం అనకాపల్లి రింగ్ రోడ్డు వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి బూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని, అవసరమైతే చార్జీలు తగ్గిస్తానని, వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానని బూటక హామీలు, ప్రగల్భాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని తుంగలో తొక్కారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకపోగా ప్రజలపై కరెంటు చార్జీల భారాలు మోపారన్నారు. కరెంటు చార్జీల బాదుడుపై ఈ నెల 27న జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, మలసాల కిషోర్, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కెఎం నాయుడు, కోరుకొండ రాఘవ, మూనూరు శ్రీను, కలగా గున్నయ్య నాయుడు పైలా శ్రీనివాసరావు, దేవరాపల్లి జెడ్పిటీసీ సభ్యులు కర్రి సత్యం ఇతర నాయకులు పాల్గొన్నారు.

తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణం స్ప్రే చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : వర్షాల వల్ల తడిసిన వరి పనలు మొలక రాకుండా, రంగు మారకుండా ఉండాలంటే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని తడిసిన వరి పనలపై పిచికారీ చెయ్యాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో పీలా శ్రీనివాసరావు పొలంలో ఉప్పు ద్రావణం పిచికారీని సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఆకాశం మేఘావృతంగా ఉండడం వల్ల రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని, పొలంపై ఉన్న పంటను కుప్పలు వేసుకోవాలని సూచించారు. మండలంలోని ఆర్‌వై అగ్రహారం, వారాడ, సంతపాలెం, మర్రివలస, ఆర్లి, కింతాడ, కొరువాడ, రొంగలినాయుడుపాలెం, కె.కోటపాడు గ్రామాలలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేసినట్లు సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎ సుధీర్ పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని తునివలస, దండి సురవరం, దిబ్బపాలెం, అప్పలపూడి గ్రామాలలో తడిసిన వరి పంటను మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి పరిశీలించారు. వరి పొలాల్లో నీరు ఉన్న ప్రదేశాల్లో చిన్న చిన్న కాలువల చేసి ముప్పికి గురవకుండా చూడాలన్నారు. మండలంలో ప్రస్తుతం తుపాను కారణంగా తడిసిన వరి పంట వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు.

పాడి రైతుకు పశు బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం గ్రామంలో సోమవారం పాడి రైతు ఎస్ వెంకట రామారావుకు పాడి పశువు బీమా పరిహారం సొమ్ము రూ.40 వేలు హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కొండ్రపు శేషు అందజేశారు. కార్యక్రమంలో ఏ నాగేశ్వరరావు, జి అప్పారావు, ఏ రాజారావు, ఎల్ శ్రీను, జి కొండలరావు పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలో చేపలు పెంపకానికి చెరువుల్లో వేసే వ్యర్థాలను పట్టుకోవడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 15 రోజుల క్రితం తారువా గ్రామంలో చేపలు పెంపకానికి వ్యాన్‌లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను కోగా, వారం రోజుల క్రితం కొత్తపెంటలో మరో వ్యాన్‌ను వ్యర్థపదార్థాలతో పట్టుకున్నట్లు చెప్పారు. తాజాగా మండలంలోని చినులపాలెం గ్రామానికి చెందిన చేపల వ్యాపారికి ఆటోను మారేపల్లి విఆర్వో సోమవారం పట్టుకొని మత్స్యశాఖ అధికారులకు అప్పగించారని తెలిపారు. నెల రోజుల వ్యవధిలో మూడు వాహనాలు దొరికాయని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ జరిమానాలతో సరిపెడుతున్నారని, అందువల్ల జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని చేపలకు వేసే వ్యర్థాలను పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని, పెంపకందార్లు పట్ల కఠినంగా వ్యవహరించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

జెడ్‌పిటిసిల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక సిరసపల్లి అమరావతి రిసార్ట్‌లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్‌పిటిసి సభ్యుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని జెడ్‌పిటిసిలు అందరూ కుటుంబంతో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈసందర్భంగా పరవాడ జెడ్‌పిటిసి పిఎస్.రాజు జెడ్‌పి ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

రైవాడ కాలువకు రంధ్రం

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ నుండి జీవీఎంసీ నీటి సరఫరా అవుతున్న కాలువకు విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు గుండి వారి కళాలవద్ద రంధ్రం పడడంతో మండలంలోని నాగయ్యపేట, వావిలపాడుకు చెందిన పంట పొలాలలో వరి పనలు నీట మునిగాయి. తుపాను హెచ్చరికలతో రైతులు కోసిన వరి పనలు కుప్పలు వేయడానికి సోమవారం వెళ్లడంతో వరి కుప్పలు, ఎండ బెట్టిన వరి పనలు నీట మునిగి ఉన్నాయి. దీంతో జీవీఎంసీ పర్యవేక్షకులు పోలినాయుడు, సిబ్బందితో పడిన రంధ్రం రైతులు కలిపి పూడ్చారు. ఇలాంటి రంధ్రాలు లేకుండా చూడాలని రైతులు కోరారు.

ఎంపీ రమేష్‌ను కలిసిన పోతల

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ జలాశయం ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా నియమితులైన పోతల పాత్రు నాయుడుయ సోవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ని అనకాపల్లిలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. రైవాడ జలాశయం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పెద్దాడ వెంకట రమణ, చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, బంధం అప్పలరాజు, దివి శంకర్, గొర్లె గోవింద, చిటిమిరెడ్డి నాయుడు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్ నాగమ్మ

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని రత్నంపేట, పనసలపాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల తహశీల్దార్ సిహెచ్.నాగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుల్లో రైతులు ఎనిమిది దరఖాస్తులు అందజేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ, రైతుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూసదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరామ్మూర్తి, వీఆర్వో అప్పారావు, సర్వేయర్ పాల్గొన్నారు.

నక్కపల్లి:రెవెన్యూ పరమైన సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసిల్దార్ నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు సుధాకర్, సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో సోమవారం తహశీల్దార్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు జి.రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ గొడ్డేటి రాజు వినతిపత్రం అందజేశారు. ఉపసర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు బెల్లపు కొండలరావు, వార్డు మెంబరు రాజుబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని అమనాం గ్రామంలో తహశీల్దార్ పైలా రామారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 50 మంది దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాసు రాజు, విఆర్ఓ పి.శ్యామ్ సుందర్, సచివాలయ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గుడిలోవ పంచాయతీలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదసుసలో సుమారు 30 అర్జీలు వచ్చినట్లు సర్వే డిప్యూటీ తహశీల్దార్ గోవిందరావు తెలిపారు. శ్రీరంగనాథ స్వామి దేవాలయ పరిసర ఎండోమెంట్ భూమి ఉన్నందున ఎండోమెంట్ అధికారులు, అటవీ శాఖ అధికారులు సదస్సుకు హాజరయ్యారు. స్థానిక రెవెన్యూ పరిధిలో అప్పట్లో 60 మంది రైతులకు ఫ్రీ హోల్డ్ భూములు రద్దయిన వాటిని వెంటనే పునరుద్ధించాలని సుమారు 60 మంది రైతులు సదస్సుల్లో వినతి పత్రాలు అందజేశారు. విఆర్ఓ హేమ పాల్గొన్నారు.

సబ్బవరం: భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దారు బి.చిన్నకృష్ణ తెలిపారు. మండలంలోని బాటజంగాలపాలెం సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై 12 అర్జీలు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ పడాల వెంకటరమణ, కూటమి నాయకులు వనం సత్యనారాయణ, భరిణికాన బాబూరావు, కాపుశెట్టి నరసింహమూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని నునపర్తి పంచాయతీ శివారు జిపి అగ్రహారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు జివి జనార్దన్ ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌విని నగేష్, మండల సర్వేయర్ జె.రాధ, వీఆర్వో అనంతరావు, ఉపసర్పంచ్ పోలవరపు నాగరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కె కోటపాడు, ఏ కోడూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కె.కోటపాడు సదస్సులో తహశీల్దారు భాగ్యవతి, ఏ.కోడూరులో సర్వేయర్ రామచంద్రమూర్తి భూ సంబంధిత సమస్యలపై వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, విఆర్ఓ జగదీష్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహశీల్దారు ఎం.లక్ష్మీ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దాడ నాయుడు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎఎస్ఐతో మాట్లాడుతున్న నాయకులు

అల్లరి మూకలను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేటలో స్కూల్స్, కాలేజీలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థిని లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.బాలాజీ ఎం.రమణ కోరారు. పాయకరావుపేటలో ఎఎస్ఐకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాయకరావుపేట ప్రాంతంలో స్కూల్స్, కాలేజీలో విడిచి పెట్టే సమయంలో రోడ్లపైన, స్కూలు,కాలేజీ ప్రాంగణాల్లో విద్యార్థినిలను అల్లరి మూకలు ఇబ్బందులు పెడుతున్నారని, ర్యాగింగ్ చేస్తున్నారని తెలియజేశారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించడంతో అల్లర్లకు, అగత్యాలకు పాల్పడుతున్నారని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని కోరారు. ఎవరైనా అల్లరి మూకలు ఇబ్బందులు పడితే ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా, మనో ధైర్యంతో ఎదుర్కోవాలని విద్యార్థినిలకు ఎస్ఎఫ్ఐ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జల్లా శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి రూపాయలు మంజూరు చేశారని మాజీ ఎంపిటిసి భీమిరెడ్డి సత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ, ఈ నిధులతో పంచాయతీలోని పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమిరెడ్డి రాంబాబు, కామిరెడ్డి శ్రీరామమూర్తి, మెండం శ్రీను, బొట్ట శ్రీను, భీమిరెడ్డి బాబులు, భీమిరెడ్డి గంగునాయుడు మజ్జి ప్రసాద్ భీమిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

తాతయ్యబాబును సన్మానిస్తున్న నాయకులు

తాతయ్యబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ, వడ్డాది:గొలుగొండ మండలా నికి చెందిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్ సోమవారం బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రమేష్ తాతయ్యబాబును సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొని తాతయ్యబాబుని సత్కరించి జిల్లా వ్యాప్తంగా సమస్యలును ఆయన దృష్టికి తీసుకురావటంతో వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

అభినందిస్తున్న ఎంపీ రమేష్

సర్పంచ్, అధికారులకు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి పంచాయతీకి సమృద్ధి నీటి సరఫరా విభాగంలో జాతీయ అవార్డు రావడంతో సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, ఎంపీడీవో సీతారామరాజు, డిపిఒ శిరీషారాణి, సంబంధిత అధికారులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అభినందించారు. న్యాయంపూడి పంచాయతీకి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో దీన్ దయాల్ ఉపదయా పంచాయితీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డు దక్కింది. ఈనెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ఈ పురస్కారాన్ని అందించారు. ఈ మేరకు అనకాపల్లిలో సోమవారం ఎంపీ రమేష్ ను సర్పంచ్, ఎంపీడీఒ, జిల్లా పంచాయతీ మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తన సహకారం అందిస్తామన్నారు.

బస్‌లో ఆసుపత్రికి తరలింపు

బస్‌లో తరలిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- మాడుగుల:అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ నగదు లేక వైద్య పరీక్షలు చేయించుకోలేని ప్రజలను మాడుగుల మండలం కస్పా జగన్నాధపురం భానోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం వ్యవస్థాపకులు, ఛైర్మన్ రాపేటి రామ కొండలరావు మాస్టర్ నేతృత్వంలో తగరపువలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి 56 మందిని మెరుగైన వైద్యానికి సోమవారం తరలించారు. మండలంలో ఓమ్మలి, గాదిరాయి, చింతలూరు, జాలెన గ్రామాల నుండి ఒక బస్సు, కస్పా జగన్నాధపురం గ్రామం నుండి మరొక బస్సులో రోగులకు ఆపరేషన్, ఇతర వైద్య చికిత్స కోసం తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భానోదయ సంస్థ కార్యదర్శి, విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి పెచ్చేటి కొండలరావు, దేముళ్ళు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న నాయకులు

బోరు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాతమల్లంపేటలో సోమవారం బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎంపీపీ నిధులు లక్ష రూపాయలతో ఈ బోరు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ బోరు నిర్మాణం ఇక్కడ ప్రజల నీటి కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గెడ్డం ఆనంద్, వైసీపీ నాయకులు పప్పల రమణ, గెడ్డం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్

ప్రజాశక్తి -అనంతగిరి:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో ఈనెల 24న మండల ఉపాధి హామీ కార్యాలయం వద్ద బహిరంగ సోషల్ ఆడిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో ఏవివి .కుమార్, ఏపీవో పేర్కొన్నారు.

మైక్ సెట్‌ను ఇస్తున్న నాయకులు

ఆలయానికి మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి -నాతవరం:మండలంలోని చిక్కుడుపాలెం గ్రామంలో శివాలయానికి సోమవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర మైక్ సెట్‌ను ఆలయ ధర్మకర్త, పూజారి సీతారామశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ఈ దేవాలయాన్ని మరింత అభివృద్ధి కోసం తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, టీడీపీ యువ నాయకులు వెలగా కృష్ణారావు, నాతవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్లకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో 24 పంచాయతీలోని గ్రామాల్లో 75 పశువుల షెడ్లకు కోటి 79లక్షలు నిధులు మంజూరు అయినట్లు ఉపాధి హామీ పథకం ఏపిఒ ఈశ్వరరావు తెలిపారు. వీటిలో 66 షెడ్ల ఆయా గ్రామాల రైతులు నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. వీటిలో కొన్ని ఆరు పశువులకు, నాలుగు, రెండు పశువులకు షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు.

పరిశీలిస్తున్న ఎపిఒ

సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్

భూ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -కోటవురట్ల:రెవెన్యూ గ్రామాలలో తలెత్తిన వివిధ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వీడాలని తహసిల్దారు తిరుమలబాబు గ్రామ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రీ సర్వే గ్రామాలలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిరంతరం గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సులతో పాటు, పిజిఆర్ఎస్‌లో అందుతున్న ఫిర్యాదులను రైతులతో మమేకమై త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. డిటి రమేష్, విఆర్వోలు పాల్గొన్నారు.

అల్పపీడనంతో అన్నదాత కుదేలు

-తడిసిముద్దయిన వరి పంట -పనలు ఆర బెట్టేందుకు అవస్థలు

వరి పనలను ఒడ్డున ఆర బెడుతున్న రైతులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట వర్షాలు కురవడంతో రైతులకు కన్నీరే మిగిలింది. కోసిన పంట ఆరకుండానే వర్షాలు పడటంతో నీట మునిగింది. సోమవారం కురిసిన జల్లుకు పూర్తిగా తడిసిపోయాయి. నర్సీపట్నం, వేములపూడి, అమలాపురం, బలిఘట్టం, గబ్బాడ పలు చోట్ల కోసిన వరి పంట తడిసిపోయింది, దీంతో రైతన్నలు పొలంలోనే వరి కుప్పలు పెట్టారు. పొలాల్లో వరి కుప్పల చుట్టూ వర్షపు నీరు నిలిచి ఉంది. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో పొలాల్లోనే కుప్పలు పెట్టారు. వరి కుప్పల చుట్టూ చేరిన నీరు బయటకు పంపడానికి కొన్ని ప్రాంతాల్లో ఇంజిన్లు వినియోగించారు. ఇప్పటికే వారం రోజులుగా అడపా దడపా పడుతున్న జల్లులకు తడిసిన వరి పనల నుంచి మొలకలు వస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లోని దాన్యం తడిచి పోవడంతో ఆపసోపాలు పడుతూ ఆర బెడుతున్నారు. పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఇంత నష్టం జరిగినా వ్యవసాయ అధికారులు ఎక్కడా కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు పది రోజులుగా అన్నదాతను వరుణుడు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు. తాజాగా సోమవారం బంగాళాఖాతంలో మరో ఇల్పపీడనం ఏర్పడే వాయుగుండంగా మారవచ్చని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. జల్లులు కురవడంతో నేలపై ఉన్న వరి పన్నలు తడిసి మొక్కలు రావడం దాన్యం రంగుమారడంతో హడావుడిగా ధాన్యం నూర్పి పరకాలపై రాశులుగా పోసి ఆరబెడుతున్నారు.

తడిసిపోయిన వరి పంట

మండలంలో దాదాపుగా వరికోతలు పూర్తియ్యాయి. కొందరు సాధారణ పద్ధతిలో నూర్పిడి చేయగా మరికొందరు వరికోత యంత్రాలతో నూర్పిడి చేసి ఆరబోశారు. ఎకరానికి రూ. 30 వేలకు పైగా పెట్టుబడి పెట్టి పంట కోసం ఎదురు చూస్తున్న రైతులకు వర్షం కన్నీటిని మిగిల్చింది. కొందరు రైతులు తడిపోడిగానే కుప్పలు వేస్తున్నారు. రైతులు పంటను దక్కించు కునేందుకు పరుగులు పెడుతూ కుప్పలు వేస్తున్నారు. మండలంలో 1983 ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 1400 ఎకరాల పైగా కోతలు జరిగాయని వ్యవసాయా ధికారులు చెబుతున్నారు.

పెద్దేరులో పడిన ఎడ్లు

పెద్దేరులో పడి ఎడ్లు మృతి

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని జంపెన వద్ద ప్రవహిస్తున్న పెద్దేరు నదిలో సోమవారం ప్రమాదవశాత్తు రెండు కాడెడ్లు మునిగి మృతి చెందాయి. స్థానికులు కథనం ప్రకారం ఎప్పటిలాగే మాడుగుల గ్రామానికి చెందిన పోతల సుబ్రరావు ఏటి అవతలికి వెళ్లడానికి పెద్దేరులోకి బైరు బండితో దిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాలుకు పెద్దేరులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాళ్ళు అందక, నీటి ముంపుకు గురై ఎడ్లు మృతి చెందాయి. రైతు చాకచక్యంతో తప్పించుకని బటయ పడ్డాడు. కాడెడ్లు రెండు మృతితో సుమారు లక్షా 50 వేల నష్టం జరిగిందని రైతు వాపోయాడు.తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

మాడుగుల:మాడుగులకు చెందిన రైతు పోతల సుభ్రద్రావు రెండు కాడేడ్లు సోమవారం పెద్దేరులో మృతి చెందాయి. ఈ సంఘటన వివరాలు తెలుసుకున్న మాడుగుల జనసేన పార్టీ నాయకులు నష్టపోయిన రైతన్నకు 10 వేలు రూపాయిలు నగదు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల బండి రైతు సంఘం సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: విజయవాడ కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీలలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2024-25 పోటీలలో చెట్టుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారని ప్రధానోపాధ్యాయులు పీవీ రామకృష్ణారావు తెలిపారు. అక్టోబర్ 20న నర్సీపట్నంలో నిర్వహించిన ఉమ్మడి విశాఖజిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఎంపికయిన విద్యార్థులు విజయవాడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 52 కేజీల విభాగంలో ఏ పూర్వజ గోల్డ్ మెడల్, 47 కేజీల విభాగంలో లక్ష్మీదేవి సిల్వర్ మెడల్, అమృతవల్లి బ్రాన్ మెడల్ సాధించారని క్రీడా ఉపాధ్యాయురాలు దేవి తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను గ్రామస్తులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గెలుపొందిన విద్యార్థులు

వెంకన్నను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీనివాసుడు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను హంస వాహనం పైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోనూ వేయింపజేసి ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో గ్రామ తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలా చార్యుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అభినందనలు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్:గ్రామీణ జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో 79 పంచాయతీలలో వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహిస్తున్న వారిని గుర్తించి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ సత్కరించి అభినందించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల విభాగంలో ఆనందపురం గ్రామానికి చెందిన చందక ధనలక్ష్మి, వెల్లంకి గ్రామానికి చెందిన బూసా మంగ, చెప్పాడకు చెందిన కొయ్య చిట్టితల్లి, సింగనబంద కు చెందిన కాళ్ళ సురేష్, పినగాడి కి చెందిన రావాడ శివ ఉండగా, సామాజిక మరుగుదొడ్ల విభాగంలో పెదగాడి సామాజిక మరుగుదొడ్డి నిర్వహించడంలో కృషి చేసిన సర్పంచ్ కోసుబోయిన లావణ్య, గ్రామ కార్యదర్శి కె. లక్ష్మణరావు లను, అలాగే ఆనందపురం మండలం వేముల వలసకు చెందిన సర్పంచ్ లంక కొండమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.రామకృష్ణ నాయుడులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎవిఎ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ కెవివి చౌదరి పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ గ్రాంట్స్ పూర్తిగా మంజూరు చేయకపోవడంతో నూతన సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఉద్యోగులు, పెన్షనర్లు జీతాలు పొందలేని పరిస్థితి నెలకొందని రాష్ట్ర,జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా, గ్రంథాలయ శాఖ మంత్రి నారా లోకేష్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి పి.నారాయణ లను ఈ- మెయిల్ ద్వారా కోరామన్నారు. సుమారు రూ.1265 కోట్ల మేర గ్రంథాలయ పన్నును నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలు, పంచాయతీలు చెల్లించని కారణంగా నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వసూలైన లైబ్రరీ సెస్ ను ఎప్పటికప్పుడు చెల్లించవలసినప్పటికీ, స్థానిక సంస్థల చెల్లించక పోవడంచే గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. 2023-24 సంత్సరంలో జీతాలు, పెన్షన్లకు కేవలం రూ.40 కోట్లు విడుదల చేశారని చెప్పారు. మిగిలిన సొమ్మును,ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 3 వ క్వార్టర్ కు చెల్లించవలసిన జీతాలు, పెన్షన్ గ్రాంట్ సత్వరమే విడుదల చేయించవలసిందిగా మంత్రులను కోరినట్లు తెలిపారు.

వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, 10 రోజుల్లో పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, జివిఎంసి సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ కు

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు.సిఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.జిల్లాలో అధికంగా రీ-ఓపెన్ అర్జీలు రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.అర్జీలు పునరావృతం అయితే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.శాఖల వారీగా పెండింగ్ వినతులు, పునరావృతం అయిన అర్జీలు, తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 335 వినతులు అందాయి.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

గిరిజన కాఫీ రైతు సంఘం నాయకుడు పాలికి లక్కు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన కోపరేటివ్ సంస్థ ప్రకటించిన కిలో కాఫీ కి రూ.320 కాఫీ రేటు గిట్టుబాటు కాదని, రూ. 500 రూపాయిలు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతు సంఘం నాయకుడు పాలికి లక్కు సోమ వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో జిసిసి చైర్మన్ ప్రకటించిన కాఫీ రేటు కూడా గిట్టుబాటు కాదన్నారు .అంతర్జాతీయంగా చూసుకున్నప్పుడు కాఫీ రేటు విపరీతంగా పెరిగిందని, . కిలో కాఫీ పార్చ్మెంట్ రూ.450 నుండి 500 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ దళారులు 350 నుంచి 400 కొనుగోలు చేస్తున్నారన్నారు. దానికి ఆధారంగా రెట్లు పెంచాలన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ గిరిజన ప్రాంతంలో వాణిజ్య పంట అయిన కాఫీని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. అకాల వర్షాలు తుఫాన్ కారణంగా వేసుకున్న రాజ్మ చిక్కులు కూడా పూర్తిగా నష్టపోయారన్నారు.

ఆక్రమణలపై ఘర్షణ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట లో స్థానిక దుర్గా దేవి ఆలయానికి చెందిన స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడంతో ఆలయ కమిటీ సభ్యులు సోమవారం సాయంత్రం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కోట రామయ్య దొర ఆలయం పక్కన ఇది వరకే మండల పరిషత్ కు చెందిన స్థలం ఆక్రమించి షెడ్లు నిర్మాణం చేశారు. ఇప్పుడు మరలా ఆలయం అవసరాలకు కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు అడ్డు కోవడంతో ఇరు వర్గాల మధ్య కొంత ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలో సర్వే 140-1 లో 0.30 సెంట్లు 140-2 లో 0.38 సెంట్లు, 140-3 లో 1.49 (ఎకరా 49 సెంట్లు) ఉంది. కాగా సర్వే నెం 140-2 లో 0.38 బి ఎన్ రోడ్డు లో కలిసి పోగా మిగతా స్థలం ఉండేది. మొత్తం మండల పరిషత్ కు సుమారుగా 2.17 సెంట్లు రికార్డు పరంగా ఉండగా ప్రస్తుతం కేవలం సుమారు 0.60 నుంచి 0.70 సెంట్లు మాత్రమే మిగిలిన ఉంది. మిగతా స్థలం మొత్తం ఆక్రమణలకు గురైంది. పంచాయతీ కార్యాలయం సమీపంలో కొంత స్థలంలో షిరిడి సాయి, వీర బ్రహ్మం వారి దేవాలయాలు నిర్మాణం చేయగా మిగతా కొంత స్థలంలో ఆక్రమణ నిర్మాణాలు చేపట్టారు. కాగా ఇటు రవి టాకీస్ సినిమా హాల్ నుంచి దుర్గాదేవి ఆలయం వరకూ ఆక్రమణలు చేసి షెడ్లు నిర్మాణం చేశారు. దీనిపై గ్రామస్తులు పలు మార్లు నిరసన వ్యక్తం చేసినా అధికారులు పట్టించు కోలేదు.

ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు